క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

బంగారుపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నివేదికలతో హాజరుకావాలని కోరారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సెప్టెంబర్‌లో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ప్రబోధ సేవా సమితి-హిందూజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాజీ వైస్ ఎంపీపీ హిమకర్‌రాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి విడుదల చేశారు. సెప్టెంబర్ 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు స్థానిక రాజావీధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ధనుంజయ, హర్షవర్ధన్, లత, చాముండేశ్వరి, రామతులసి, విమలమ్మ, రెడ్డెమ్మ, శాంతమ్మ, హేమంత్ పాల్గొన్నారు.

మలగంగులమ్మకు ప్రత్యేక పూజలు

యాదమరి: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామంలో మలగంగులమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులు సహపంక్తి భోజనాలు చేశారు.

36 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జాబ్‌మేళాలో 36 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో వివిధ ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొన్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులు రూ.2,25,000 నుంచి రూ.3,20,000 వార్షిక ఆదాయం అందుకుంటారని వెల్లడించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తోందని పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 64 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సింధు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

108లో ప్రసవం



వాహనంలో ప్రసవించిన మధు

గుడిపాల: మండలంలోని ఏఎల్‌పురం ఎస్టీకాలనీకి చెందిన చెందిన మధు(19)కు మంగళవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో 108కి కాల్ చేశారు. 108 వాహనంలో ఆమెను తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో 108 వాహన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ప్రియ, పైలట్ బాబీ ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

నేడు అవగాహన సదస్సు

చిత్తూరు కార్పొరేషన్: బీఎస్‌ఎన్‌ఎల్ సేవలపై బుధవారం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆశాఖ డీఈ సురేంద్రనాథ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఓవర్‌బ్రిడ్జి కింద గల బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. వినియోగదారులు సదస్సుకు హాజరుకావాలని కోరారు.

అమ్మ భాష అమృతం

- సమాజాన్ని మేల్కొలిపేది తెలుగు భాష
- డీఈఓ విజయేంద్రరావు
- మాతృభాషలో పట్టు సాధిస్తే చాలు : ఆర్డీఓ రేణుక
- అట్టహాసంగా తెలుగుభాషా దినోత్సవ సంబరాలు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు





గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక



బంగారుపాళెం: గుండ్లకట్టమంచి పాఠశాలలో..

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగు భాషోద్యమం పిడుగు, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో వేడుకలను నిర్వహించి గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమ్మభాష ఔన్నత్యానికి ఆయన చేసిన కృషిని వారు కొనియాడారు. అమృత భాష తెలుగును కాపాడుకునేందుకు మన వంతు బాధ్యత మనం చూపాలన్నారు. పలుచోట్ల విద్యార్థులు వేసిన తెలుగుకవుల వేషధారణలు, సాంస్కృతిక నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొలిపేది భాషే అన్నారు. అమ్మభాషను రక్షించడం అంటే కన్నతల్లిని గౌరవించడమేనని చెప్పారు. ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవంలో ఆర్డీఓ రేణుక మాట్లాడుతూ మాతృభాషలో పట్టు సాధించినప్పుడే ఇతర భాషల్లో విజ్ఞానం, నైపుణ్యం సులువుగా అవగతం అవుతాయని తెలిపారు. అలాగే న్యూబాలాజీ కాలనీలో ఉన్న కేశవరెడ్డి పాఠశాల, దేవి పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

తెలుగు మాధుర్యాన్ని జగతికి చాటుదాం..

గుడిపాల: తెలుగు మాధుర్యాన్ని ప్రపంచానికి చాటి, తెలుగు ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలని చిత్తూరు లలిత కళావేదిక హరివిల్లు అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. గుడిపాలలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అధ్యక్షతన తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాంథిక భాషను వాడుక భాషలోకి తెచ్చిన ఘనుడు గిడుగు రామ్మూర్తి దంపతులు అన్నారు. విద్యార్థులు ఎన్ని భాషలు నేర్చినా తెలుగుభాషను మరువరాదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 గణపతి, హరివిల్లు గౌరవ అధ్యక్షుడు హరినాయుడు, ఉపాధ్యాక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి గోవిందన్, సభ్యులు, స్పందన ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్యామలదేవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషాపై మమకారం పెంచాలి

తెలుగుభాషాపై ప్రతి ఒక్కరికీ మమకారం పెంచాలని తెలుగు రచయిత, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత హరికృష్ణారెడ్డి తెలిపారు. గుడిపాల మండల కేంద్రంలోని సీఎస్‌ఆర్ కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ పాల్గొన్నారు.

అమృత భాష తెలుగు

పూతలపట్టు: అమ్మ భాష అమృతం వంటిదని తెలుగు ఉపాధ్యాయుడు వెంకటరత్నం అన్నారు. మంగళవారం మండలంలోని పి.కొత్తకోట ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు.

యాదమరి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తికి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మాతృ భాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని తవణంపల్లె హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరంజని అన్నారు. తవణంపల్లె హైస్కూల్, అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంత ఎదిగినా, సొంత ఊరిని, కన్నవారిని, మాతృ భాషని ఎప్పటికీ మరువరాదని అన్నారు.

తెలుగుభాష మహోన్నతమైంది

బంగారుపాళెం: తెలుగుభాష మహోన్నతమైందని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బేరీనాథ్ అన్నారు. వ్యవహారిక భాషకు ఆద్యుడైన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పించారు. తెలుగు భాషకు ప్రాణం పోసేందుకు పాటుపడిన కవుల పాత్రలను విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. వ్యాసరచన, పద్యపఠన విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు పండిట్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలో నిర్వహించిన భువన విజయం నాటికను విద్యార్థులు ప్రదర్శించారు. హెచ్‌ఎం అబ్దుల్‌సుభాన్, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టేకుమంద జెడ్పీ హైస్కూల్‌లో భువన విజయం నాటిక ప్రదర్శన



కేశవరెడ్డి పాఠశాలలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ జయంతి



యాదమరి: వివిధ వేషధారణల్లో విద్యార్థులు



గుడిపాల: మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి



గుడిపాలలో..



పూతలపట్టు: విద్యార్థికి బహుమతి ప్రదానం



అరగొండ బాలికోన్నత పాఠశాలలో..

అర్హతే ఆధారంగా సంక్షేమ ఫలాలు

- టీడీపీ వారికి పథకాలు అందిస్తున్నాం
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు టీడీపీ నాయకుల ఇళ్లకు సైతం చేరుతున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక 30వ డివిజన్‌లో మేయర్ అముదతో కలిసి పలమనేరు రోడ్డు, సీబీ రోడ్డు సమీప ప్రాంతాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఆ పార్టీ సానుభూతిపరులకే పథకాలు అందేవని ప్రస్తుతం తారతమ్యం లేకుండా అర్హులందరికీ వలంటీర్ల ద్వారా ప్రతి గడపకు అందుతున్నాయని తెలిపారు. జగనన్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు వరిస్తుండడంతో ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో కాలువలు నిర్మించాలని స్థానికులు విన్నవించారు. అదేవిధంగా సీసీరోడ్డు, విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత సమ స్యలు పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, 30వ డివిజన్ కార్పొరేటర్ సుష్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, కోఆప్షన్ మెంబర్ కిరణ్, కార్పొరేటర్ చల్లా ముత్తు, నాయకులు మున్నా, రాజా, అంజాద్, శేఖర్, అల్తాఫ్, మున్నీర్ పాల్గొన్నారు.

నేడు తిమ్మసముద్రంలో..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 49వ డివిజన్‌లో తిమ్మసముద్రంలో నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు వినాయకస్వామి ఆలయంలో పూజలు చేసి ఎమ్మెల్యే డివిజన్‌లో పర్యటిస్తారని ఆయన కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది.

నేడు మనగుడి

చిత్తూర రూరల్: నగరంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో మన గుడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అర్చకులు వేణుగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ప్రతి గడపలో సంతోషం



ముస్లింవాడలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం నెలకొందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం యాదమరి మండలంలోని మోటాన్‌పల్లె, 14 కండిగ ముస్లింవాడ, చిన్నిరెడ్డిపల్లె, చిన్నిరెడ్డిపల్లె దళితవాడ, సామిరెడ్డి పల్లె గ్రామాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డితో కలిసి పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల అమల్లో సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల బతుకుల్లో వెలుగు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకు చేరవేస్తున్నారని చెప్పారు. 14 కండిగ ముస్లింవాడ పంచాయతీలోని చిన్నిరెడ్డి పల్లె దళితవాడలో విద్యుత్ పోల్‌లో వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న విద్యుత్‌శాఖ ఏఈ గుర్రప్పను పిలిచి వెంటనే సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు కబీర్ బాషా, సర్పంచ్ తన్వీర్, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, మనోహరన్, పరందామ గౌడ్, రాధాకృష్ణ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు బొమ్మన్ చేను పంచాయతీలో..

మండలంలోని బొమ్మన్ చేను పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యం



గుడిపాల: ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష



గుడిపాల: బండపల్లెలో ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందజేస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నామని గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు హరి, అనూష అన్నారు. మంగళవారం బండపల్లె, శ్రీరంగంపల్లె గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. 130 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలు అందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యసేవలను అందించారు. వైద్య సిబ్బంది చంద్రశేఖర్, రిజ్వాన, అన్నపూర్ణ, శిరీష, శివగామి, విజయ, హేమలత, సంధ్యలు పాల్గొన్నారు.

రికార్డులను పక్కాగా నిర్వహించండి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు రూరల్ : నగరపాలక సంస్థలోని 43, 44 వార్డుల్లో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులు, పారిశుద్ధ్య నిర్వహణను నగర కమిషనర్ అరుణ మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ రంగాచారి వీధి, పాత మార్కెట్ వీధి, బ్రాహ్మణ వీధి, బజార్ వీధి ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో ఎక్కడా వ్యర్థాలు ఉండరాదని, తడి, పొడిగా వేరు చేసి తరలించాలన్నారు. పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు తమ విధుల నిర్వహణకు సంబంధించి రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మురుగునీటి కాలువల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. మురుగు నీటి కాలువల నిర్మాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధానంగా నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా లెవలింగ్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ వెంకట ప్రసాద్, ఎంహెచ్‌ఓ డా.లోకేష్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు
- రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల సమీక్ష సమావేశం
- హాజరైన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలకు సంబంధించి ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీచరణ్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే పథకంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. స్పందన, జగనన్నకు చెబుదాంలో నమోదవుతున్న రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్లలో శ్మశాన వాటికల ఏర్పాటుపై వేగవంతంగా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న లేఅవుట్‌లలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి..

ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోందన్నారు. నియోజకవర్గాల వారీగా అభివృద్ధికి ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి, ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం..

ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యం రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ కోదలమడుగు, టేకుమంద, మొగిలి, కీరమంద, పాలేరు గ్రామాల్లో సోలార్ ఫెన్సింగ్ నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

బాధ్యతగా సమస్యలు పరిష్కారం..

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అలసత్వం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను బాధ్యతతో పరిష్కరించాలని చెప్పారు. అనంతరం గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల అభివృద్ధిని ఆయన మంత్రులకు వివరించారు. సమీక్షలో జేసీ శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూతలపట్టు.. ప్రగతి ఇలా..

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల్లో పూతలపట్టు నియోజకవర్గంలో రూ.35.85 కోట్లతో 98 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా, రూ.27.28 కోట్లతో 69 భవన నిర్మాణాలు, రూ.18.76 కోట్లతో 95 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా రూ.14.04 కోట్లతో 59 ఆర్‌బీకే భవనాలు, రూ.11.91 కోట్లతో 68 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా రూ.7.58 కోట్లతో 26 భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.33.17 కోట్ల అంచనా వ్యయంతో 778 పనులు మంజూరు కాగా రూ.16.26 కోట్లతో 353 పనులు పూర్తి అయినట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన 306 పనులకు రూ.9.45 కోట్ల అంచనాలతో నిధులు విడుదల అయినట్లు తెలిపారు. ఇందులో రూ.2.52 కోట్లతో 97 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. రూ.239.5 కోట్లతో 13,307 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా రూ.169 కోట్లతో 7,182 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లలో ఇంటింటికీ తాగునీరు సరఫరాలో భాగంగా 5,967 ఇళ్లకు తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు.